క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో రాట మహోత్సవం



వాడ్రాపల్లిలో కనకదుర్గమ్మతల్లి రాట మహోత్సవంలో పాల్గొన్న భక్తులు

మునగపాక: వాడ్రాపల్లి పెదరామాలయం ప్రాంగణంలో బుధవారం కనకదుర్గమ్మ తల్లి రాట మహోత్సవం ఘనంగా నిర్వహించారు. విజయదశమి వేడుకల్లో భాగంగా వేపచెట్టుకు పసుపు, కుంకుమ అద్ది ప్రత్యేక పూజల అనంతరం రాట వేశారు. మళ్ల వరహా నరసింగరావు, పెతకంశెట్టి రామజోగినాయుడు, కొయిలాడ దశావతారం, మళ్ల శేషు, మళ్ల కన్నుంనాయుడు, డీలర్ అప్పలనాయుడు, పెతకంశెట్టి లీలా భాస్కర్, కొణతాల శివ రామకృష్ణ, పారునాయుడు, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఘనంగా విశ్వకర్మ జయంతి ఉత్సవాలు



విశ్వకర్మ విగ్రహాన్ని ఊరేగిస్తున్న కామాక్షి విశ్వబ్రాహ్మణ యువజన సంఘ సభ్యులు

మునగపాక: మునగపాకలో విశ్వకర్మ జయంతి ఉత్సవాలు బుధవారం ఘనంగా నిర్వహించారు. శ్రీకామాక్షి విశ్వబ్రాహ్మణ యువజన సంక్షేమ సంఘ ఆధ్వర్యంలో విశ్వకర్మ విగ్రహాన్ని ఊరేగించారు. ఈ కార్యక్రమంలో సంఘం సభ్యులు శివకోటి సత్యనారాయణ, శివకోటి మహేష్, కొత్తల సత్యనారాయణ, గోవింద, యండపల్లి శ్రీను, గుండోజు శ్రీను, అప్పలాచారి, తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలి

మునగపాక: ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని బీజేపీ మండల అధ్యక్షుడు మళ్ల కాలేశ్వరరావు కోరారు. ప్రధానమంత్రి మోదీ జన్మదినం సందర్భంగా బుధవారం మునగపాక ఎంపీయూపీ స్కూల్‌లో మోదీ తల్లి హెరాబిన్ పేరిట మొక్కలు నాటే కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కలు నాటడంతో పాటు వాటిని సంరక్షించే బాధ్యత చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు డాక్టర్ బద్దెం సూర్యనారాయణ, బొడ్డేడ భాస్కరరావు, టెక్కలి పరశురామ్, దాడి ముసిలినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీల్లో వైద్య పరీక్షలు



శ్రీరాంపురం పీహెచ్‌సీలో వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

పాయకరావుపేట: మండలంలోని పాయకరావుపేట, మంగవరం, శ్రీరాంపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మహిళలకు బుధవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. స్వస్తనారీ సశక్త పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని పురస్కరించుకుని పలువురు మహిళలకు రక్త పరీక్షలు, షుగర్, బీపీ పరీక్షలు చేశారు. రోగనిరోధక టీకాలు, క్యాన్సర్, సీజన్ వ్యాధుల పట్ల అవగాహన కల్పించారు. పాయకరావుపేట పీహెచ్‌సీలో వైద్యాధికారులు వీఎస్ సౌందర్య, ఎంపీహెచ్‌వో డి.నెహ్రూ, శ్రీరాంపురం పీహెచ్‌సీలో డాక్టర్ సుభాష్, ఎంపీహెచ్‌ఈవో పి.వి.రమణ, వైద్య సిబ్బంది సేవలు అందించారు.

కుటుంబంలో మహిళ శక్తివంతంగా మారాలి

ఎస్.రాయవరం: మహిళలు ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ కుటుంబాన్ని బలపరచే విధంగా ఉండాలని పెనుగొల్లు పీహెచ్‌సీ వైద్యాధికారి పి.రాజేశ్వరి అన్నారు. తిమ్మాపురం, గోకులపాడు గ్రామాల్లో బుధవారం ఆరోగ్యవంతమైన మహిళ–శక్తివంతమైన కుటుంబం కార్యక్రమం నిర్వహించారు. మహిళలకు ఆరోగ్య రక్షణపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ సిబ్బంది, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎం, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రామాల్లో పొలం పిలుస్తోంది

పాయకరావుపేట: మండలంలోని కేశవరం, రాజవరం గ్రామాల్లో బుధవారం వ్యవసాయ శాఖ అధికారులు పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా క్షేత్ర సందర్శన, రైతులు, వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ శాఖ అధికారి పి.ఆదినారాయణ మాట్లాడుతూ త్వరితగతిన ఈ పంట నమోదు పూర్తి చేయాలని, వరి పంట సమగ్ర సస్యరక్షణ ఎరువుల యాజమాన్య, ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వీహెచ్‌ఏ వీరబాబు, గ్రామ సర్పంచ్‌లు, రైతులు పాల్గొన్నారు.

నేడు గ్రామ దేవతల పండగలు

మునగపాక: మండలంలోని నాలుగు గ్రామాల్లో గురువారం గ్రామ దేవతల పండగలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. మునగపాక, టి.సిరసపల్లి, ఒంపోలు, గంగాదేవిపేట గ్రామాల్లో జరిగే అమ్మవారి పండగల సందర్భంగా భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

భౌబోయ్.!



పూడిమడకలో గుంపుగా తిరుగుతున్న వీధి కుక్కలు





పెంపుడు కుక్కకు చికిత్స చేస్తున్న పశు వైద్యుడు గణేష్

- గ్రామాల్లో వీధి కుక్కలు స్వైర విహారం
- ఒంటరిగా వెళ్లాలంటే హడలిపోతున్న జనం
- కుక్కల నియంత్రణపై చర్యలు శూన్యం
- కుక్క కాటుకు రేబిస్ టీకా తప్పనిసరి

అచ్యుతాపురం రూరల్ :

వీధి కుక్కలు గ్రామాల్లో స్వైర విహారం చేస్తున్నాయి. గుంపులుగా సంచరిస్తూ దాడులకు తెగబడుతున్నాయి. బయటకు రావాలంటే జనం హడలిపోతున్నారు. మండలంలో పూడిమడక, మోసయ్యపేట, అచ్యుతాపురం, రామన్నపాలెం, చోడపల్లి, సెజ్ పునరావాస కాలనీ, పూడి ఆర్ అండ్ ఆర్ కాలనీ, హరిపాలెం, తిమ్మరాజుపేట, కొండకర్ల, అందలాపల్లి, ఖాజీపాలెం, పెదపాడు..



నరేంద్రపురంలో రేబిస్ వ్యాధి సోకిన వీధి కుక్క

ఇలా మండలంలో అనేక గ్రామాల్లో వీధి కుక్కల కాటుకు జనం గురవుతున్నారు. పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతున్న అచ్యుతాపురం పరిసర ప్రాంతాల్లో వీధి కుక్కలు వాహనాలపై వెళ్తున్న వారిని వెంబడించి గాయపరుస్తున్న సంఘటనలు నిత్యం చోటు చేసుకుంటున్నాయి. రాత్రి సమయంలో గ్రామాల్లో పాదచారులు, వాహనచోదకులను వెంబడించడంతో జనం భయాందోళనకు గురవుతున్నారు. మత్స్యకార గ్రామమైన పూడిమడక పరిసర ప్రాంతాల్లో ఎక్కువగా పిచ్చి కుక్కలు సంచరిస్తున్నాయి. నెలలో 120 కుక్కకాటు కేసులు మండలం మొత్తం ఉంటే.. అందులో పూడిమడక నుంచే 90 శాతం కుక్కకాటు కేసులు నమోదవుతున్నాయి. ఎప్పుడు ఏ కుక్క ఏ వైపు నుంచి వచ్చి దాడి చేస్తుందోనన్న భయంతో గ్రామాల్లో ప్రజలు బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. రేబిస్ సోకిన కుక్కకు బ్రెయిన్ పనిచేయని కారణంగా ఎప్పుడు ఎలా ప్రవర్తిస్తాయో తెలియని పరిస్థితి నెలకొంది. మతిస్థిమితం కోల్పోవడంతో వికారంగా తిరుగుతుంటాయి. ఆ సమయంలో ఎవరైనా తారస పడితే దాడి చేసి గాయపరుస్తున్నాయని గ్రామస్తులు చెబుతున్నారు.

కుక్కల నియంత్రణకు చర్యలు అవసరం



గ్రామంలో కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. పిల్లలు, పెద్దలు, వృద్ధులు, మహిళలు ఇంటి నుంచి బయటకు వెళ్లాలంటేనే భయపడిపోతున్నారు. అధికారులు వెంటనే కుక్కలు నియంత్రణకు చర్యలు తీసుకోవాలి.

– పేరిశెట్టి వీర వెంకట భాస్కరరావు, మోసయ్యపేట, అచ్యుతాపురం మండలం

పెంపుడు కుక్కలైనా టీకాలు వేయించాలి



కుక్క కాటు వేసిన చోట మంచినీటిని తీసుకుని సబ్బుతో బాగా శుభ్రం చేసుకోవాలి. అశ్రద్ధ చేయకుండా తప్పనిసరిగా రేబీస్ టీకా వేయించుకోవాలి. పెంపుడు కుక్కలకు ముందస్తు వ్యాక్సిన్ వేయించాలి.

– సిహెచ్.గణేష్, పశువైద్యాధికారి, అచ్యుతాపురం

ఏ జంతువు కరిచినా రేబిస్ వ్యాక్సిన్ తప్పనిసరి



కుక్కలు మాత్రమే కాదు.. ఏ జంతువు కరిచినా వెంటనే రేబిస్ వ్యాక్సిన్ వేసుకోవాలి. కుక్క కాటు వేసిన వెంటనే మంచినీటితో ఎక్కువ సమయం శుభ్రం చేసుకుంటే 99 శాతం వ్యాధిని అరికట్టవచ్చు. ఆస్పత్రిలో మొదట టీటీ వేసుకోవాలి. 5 డోసుల వ్యాక్సిన్ తప్పనిసరిగా వేసుకోవాలి. కుక్క కరిసిన రోజు మొదలుకుని 3, 7, 14, 28 రోజుల్లో వ్యాక్సిన్ వేసుకోవాలి.

– కె.శ్రావ్య, పీహెచ్‌సీ వైద్యాధికారి, అచ్యుతాపురం

డ్వాక్రా రుణ వాయిదాలు సకాలంలో చెల్లించాలి



మాట్లాడుతున్న ఎస్‌బీఐ మేనేజర్ లావణ్య

మునగపాక: డ్వాక్రా మహిళలు తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లించేలా చూడాలని మునగపాక ఎస్‌బీఐ మేనేజర్ లావణ్య కోరారు. స్థానిక వెలుగు కార్యాలయంలో బుధవారం వీవోఏలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సంఘాలకు సంబంధించిన లావాదేవీలు సక్రమంగా జరుపుకొనేలా అవగాహన కల్పించాలన్నారు. మన డబ్బులు–మన లెక్కలపై శిక్షణ పక్కాగా ఉండాలన్నారు.

సంఘాల అభివృద్ధితో పాటు తీసుకున్న రుణాలు సక్రమంగా వాయిదాల పద్ధతిలో చెల్లింపులు జరిగేలా చూడాలన్నారు. వెలుగు ఏపీఎం బాలరాజు అధ్యక్షతన జరిగిన సమావేశంలో తోటాడ బ్యాంక్ ఆఫ్ బరోడా మేనేజర్ రాజశేఖర్, సీసీలు శ్రీను, వేణు, అనురాధ, నాగమణి, పలువురు వీవోఏలు పాల్గొన్నారు.

మరిడిమాంబ ఆలయ నిర్మాణానికి విరాళం

మునగపాక: మండలంలోని తోటాడ–గవర్ల అనకాపల్లి పరిధిలోని శ్రీమరిడిమాంబ అమ్మవారి ఆలయ నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. పలువురు భక్తులు తమవంతు సాయం అందజేస్తున్నారు. దీనిలో భాగంగా గవర్ల అనకాపల్లికి చెందిన ఆళ్ల సూరిబాబు కుమారుడు డాక్టర్ వసంతకుమార్ తనవంతు సాయంగా బుధవారం రూ.10,116 నగదును విరాళంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

దేవవరం సచివాలయం తనిఖీ

నక్కపల్లి: మండలంలో దేవవరం సచివాలయాన్ని బుధవారం ఎంపీడీవో సీతారామరాజు తనిఖీ చేశారు. సిబ్బంది ఎంత మంది పని చేస్తున్నారు.. ఎంత మంది విధులకు హాజరయ్యారు.. అనే వివరాలతో పాటు, హాజరు పట్టి పరిశీలించారు. సిబంది అంతా అందుబాటులో ఉండాలన్నారు. సచివాలయంలో వివిధ అవసరాల కోసం వచ్చిన దరఖాస్తులు పరిష్కరించిన వివరాలను తెలుసుకున్నారు. ఇంటి పన్నుల వసూలుకు సంబంధించిన వివరాలపై ఆరా తీశారు. గ్రామంలో చేపట్టిన అభివృద్ధి పనులు, జమా ఖర్చుల వివరాలతో పాటు చేపట్టాల్సిన పనుల గురించి తెలుసుకున్నారు. వివిధ సేవలకు సంబంధించి ప్రజల నుంచి వసూలు చేసిన యూజర్ చార్జీలను వెంటనే ప్రభుత్వ ఖాతాలో జమ చేయాలన్నారు. అనంతరం ఆయన గ్రామంలో ఇంటింటికి వెళ్లి చెత్తను సేకరించే ప్రక్రియను పరిశీలించారు. సంపద తయారీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి శ్రీనివాస్, వెల్ఫేర్ అసిస్టెంట్ మహేష్ పాల్గొన్నారు.

సంపద తయారీ కేంద్రం సందర్శన



సంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీడీవో నాగలక్ష్మి

ఎస్.రాయవరం: గ్రామాల్లో నిరుపయోగంగా ఉన్న తడి, పొడి చెత్తల నిర్వహణ కేంద్రాలను విధిగా వినియోగించాలని డివిజనల్ డెవలప్‌మెంట్ అధికారి నాగలక్ష్మి సూచించారు. గుడివాడ పంచాయతీలో ఉన్న సంపద తయారీ కేంద్రాన్ని సందర్శించారు. అనంతరం మండలంలో ఉన్న పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో తడిపొడి చెత్తల నిర్వహణ కేంద్రాలపై అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో సత్యనారాయణ, కార్యదర్శులు రమేష్‌బాబు, ప్రసాద్, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

పునరావాస ఏర్పాట్లు త్వరగా పూర్తి చేయాలి



బోదిగల్లం వద్ద పునరావాస కాలనీని సందర్శిస్తున్న కార్యదర్శి యువరాజ్

- పరిశ్రమల శాఖ కార్యదర్శి యువరాజ్ ఆదేశం

నక్కపల్లి: మండలంలో ఏపీఐఐసీ నిర్వాసితుల కోసం బోదిగల్లం వద్ద కల్పిస్తున్న పునరావాస ఏర్పాట్లు త్వరగా పూర్తి చేయాలని రాష్ట్ర పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి డాక్టర్ ఎన్.యువరాజ్ ఆదేశించారు. బుధవారం ఆయన నక్కపల్లి మండలం బోదిగల్లం వద్ద 160 ఎకరాల్లో ఏర్పాటు చేస్తున్న లేఅవుట్, మౌలిక సదుపాయాల పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బల్క్ డ్రగ్‌పార్క్, స్టీల్ ప్లాంట్ కోసం నివాస ప్రాంతాలు కోల్పోయిన సుమారు 750 మందికి బోదిగల్లం వద్ద ప్రత్యేకంగా కొనుగోలు చేసి ఏర్పాటు చేసిన లేఅవుట్‌లో ఇళ్ల స్థలాలు కేటాయించామన్నారు. వీరికి ఇళ్ల నిర్మాణం కోసం ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ కింద రూ.8.98 లక్షలు ఇచ్చామన్నారు. బల్క్ డ్రగ్ పార్క్ పనులు చురుగ్గా జరుగుతున్న నేపథ్యంలో నిర్వాసితులను ఖాళీ చేయించి పునరావాస కాలనీకి తరలించే ఏర్పాటు చేయాలన్నారు. ఈ కాలనీలో రోడ్లు, కాలువలు, తాగునీరు, వాడుకనీరు, ఇతర కమ్యూనిటీ అవసరాలు కల్పించే పనులు త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఇళ్ల స్థలాలు పొందిన వారు ఇక్కడకు రావడానికి ఆసక్తి చూపుతున్నారా? లేదా? అనేది ఆరా తీయాలన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ విజయ కృష్ణన్, ఆర్డీవో రమణ, తహసీల్దార్ మూర్తి, ఏపీఐఐసీ అధికారులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఎస్.రాయవరం ఎంపీడీవోగా మీనాకుమారి



ఎంపీడీవో స్వాగతం పలికిన మండల పరిషత్ కార్యాలయం సిబ్బంది, అధికారులు

ఎస్.రాయవరం: ఎస్.రాయవరం ఎంపీడీవోగా పి.మీనాకుమారి బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఏడాది కాలంగా ఇన్‌చార్జ్ బాధ్యతలతో నెట్టుకొచ్చిన జిల్లా అధికారులు ఎట్టకేలకు ఎంపీడీవోను నియమించారు. ఇన్‌చార్జ్ ఎంపీడీవోగా ఉన్న జి.సత్యనారాయణ, డిప్యూటీ ఎంపీడీవో సత్యనారాయణ ఆమెకు స్వాగతం పలికి ఆహ్వానించారు. పద్మనాభం మండలంలో డిప్యూటీ ఎంపీడీవోగా పని చేసిన మీనాకుమారి పదోన్నతిపై ఎస్.రాయవరం మండలానికి వచ్చారు. ఈ మేరకు ఆమెకు మండల పరిషత్ కార్యాలయ అధికారులు, సిబ్బంది పుష్పగుచ్చాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

మెడికల్ షాపుల్లో అధికారుల తనిఖీలు

యలమంచిలి రూరల్: పట్టణంలో మెడికల్ షాపుల్లో బుధవారం ఐదుగురు ఔషధ నియంత్రణ శాఖ అధికారుల బృందం ఆకస్మిక తనిఖీలు చేపట్టింది. లైసెన్సులు తీసుకున్న సుమారు 15 దుకాణాల్లో అధికారులు చేపట్టిన తనిఖీల్లో కొన్ని చోట్ల ఫార్మాసిస్టులు లేకుండా, అమ్మకాలకు తగిన రసీదులు ఇవ్వకుండా దుకాణాలు నిర్వహిస్తున్నట్టు గుర్తించారు. కొన్ని దుకాణాలకు అధికారులే కొనుగోలుదారుల్లాగా వెళ్లి నిషేధిత నార్కోటిక్స్, మత్తు మందులు, గర్భవిచ్ఛిత్తి ఔషధాలను అడిగారు. ఎక్కడా నిషేధిత మందులు విక్రయించడం లేదని నర్సీపట్నం డ్రగ్ ఇన్‌స్పెక్టర్ ఎస్.కల్యాణి తెలిపారు. వైద్యుడి చీటీలు లేకుండా మందుల విక్రయాలు చేపట్టవద్దని వ్యాపారులను హెచ్చరించారు. పలు దుకాణాల్లో రికార్డులు, స్టాకు వివరాలు, కాలం చెల్లిన మందులు ఉన్నాయా? వంటివి పరిశీలించారు. జిల్లాలో ప్రతి నెలా పలు ప్రాంతాల్లో ఆకస్మిక తనిఖీలు చేస్తున్నామన్నారు. అనకాపల్లి, విశాఖపట్నం డ్రగ్ ఇన్‌స్పెక్టర్‌లు ఇందిరాభారతి, అభీప్రియ, ఎం.శ్రీనివాసరావు, కల్యాణి పాల్గొన్నారు.

బల్క్ డ్రగ్ వద్దంటూ నిరసన



గుర్రాజుపేట బల్క్‌డ్రగ్ వద్ద నిరసన తెలుపుతున్న రైతులు

ఎస్.రాయవరం: రసాయన వ్యర్థాలు వెదజల్లే బల్క్‌డ్రగ్ కంపెనీ తమకొద్దని గుర్రాజుపేట గ్రామ రైతులు బుధవారం నిరసన తెలిపారు. సచివాలయం వద్ద సమావేశమై నినాదాలు చేశారు. ప్రాంతాలు అభివృద్ధి చెందాలంటే ప్రజా ప్రయోజనాలు చేకూర్చే పరిశ్రమలు పెట్టాలని, ఇలా ప్రాణాలు తీసే కంపెనీలు తమ ప్రాంతంలో పెట్టవద్దని కోరారు. రాజ్యపేటలో మత్స్యకారులు చేస్తున్న పోరాటానికి తామంతా మద్దతు తెలుపుతున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమాలో రామ్‌రాజు, శ్రీనురాజు, సత్యనారాయణరాజు తదితరులు పాల్గొన్నారు.

మహిళల ఆరోగ్యానికి ప్రాధాన్యం



కోటవురట్ల సీహెచ్‌సీలో ప్రతిజ్ఞ చేస్తున్న కూటమి నాయకులు

మునగపాక: మహిళల ఆరోగ్యానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ అన్నారు. బుధవారం మునగపాక ప్రభుత్వ ఆసుపత్రిలో స్వస్త్ నారీ సశక్త్ పరివార్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు, బాలికల ఆరోగ్యంపై ప్రభుత్వం దృష్టి సారించిందన్నారు. అక్టోబర్ 2వ తేదీ వరకు జరిగే వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి విమలగిరి, హోమియో వైద్య నిపుణులు సరోజినీ, సర్పంచ్ దిమ్మల అప్పారావు, టెక్కలి పరశురామ్, దాడి ముసిలినాయుడు, ఏవీ సత్యనారాయణ, కేపీ రావు, యల్లపు భాస్కరరావు, సుందరపు ధనలక్ష్మి, సూరిశెట్టి అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు. చూచుకొండ పీహెచ్‌సీలో కూడా స్వస్త్ నారీ సశక్త్ పరివార్ కార్యక్రమాన్ని డాక్టర్ వై.రామకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించారు. సర్పంచ్ దొడ్డి సూరప్పారావు, ఎంపీటీసీ కాండ్రేగుల కిరణ్‌కుమార్, మాజీ సర్పంచ్ నరసింగరావు, పాలసంఘ అధ్యక్షులు కాండ్రేగుల నాయుడు, ఆరోగ్య విస్తరణ అధికారి గుర్రం శ్రీనివాసరావు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

కూటమి నాయకుల హడావుడి

కోటవురట్ల: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా చేపట్టిన స్వస్త నారీ–సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమం కూటమి కార్యక్రమంగా మారిపోయింది. మహిళలకు మెరుగైన వైద్యసేవలు అందించాలన్న లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ఈ కార్యక్రానికి శ్రీకారం చుట్టగా మండలం కేంద్రంలో సీహెచ్‌సీలో సూపరింటెండెంట్ డాక్టరు ప్రసాద్ ఆధ్వర్యంలో బుధవారం ప్రారంభమైంది. మహిళలకు అవగాహన కల్పించి పెద్ద పీట వేయాల్సిన ఈ కార్యక్రమంలో కూటమి నాయకుల అతి విమర్శలకు తావిచ్చింది. వైద్య సిబ్బంది, మహిళలను పక్కనపెట్టి మండలంలోని టీడీపీ, జనసేన పార్టీలకు చెందిన చిన్నా, చితకా బడా నాయకులు హడావుడి చేశారు. ప్రభుత్వ కార్యక్రమాన్ని కూటమి కార్యక్రమంలా మార్చేసి నాయకులంతా ప్రతిజ్ఞ చేసి స్వామి భక్తిని చాటుకున్నారు. అధికారులు, వైద్య సిబ్బంది మాత్రం చివరన ఉండి తలాడించాల్సి వచ్చింది.

వాహన మిత్ర కింద రూ.30వేలు ఇవ్వాలి



ఆటో కార్మికులను ఉద్దేశించి మాట్లాడుతున్న సిటూ జిల్లా ప్రధాన కార్యదర్శి శంకర్రావు

అచ్యుతాపురం రూరల్ : మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంతో నష్టపోతున్న ఆటో కార్మికులకు వాహన మిత్ర పథకం ద్వారా సంవత్సరానికి రూ.30 వేలు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.శంకరరావు డిమాండ్ చేశారు. బుధవారం అచ్యుతాపురం కూడలిలో ఆటో, క్యాబ్, టాటా ఏసీ డ్రైవర్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి డీజిల్, గ్యాస్ ధరలు తగ్గించాలన్నారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి రొంగలి రాము మాట్లాడుతూ జీవో 21 రద్దు చేసి ఇన్సూరెన్స్, జరిమానా రద్దు చేసి, ఉబర్, ఓలా సర్వీసులు ప్రభుత్వమే నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో అచ్యుతాపురం చోడమాంబిక ఆటో యూనియన్ నాయకులు దమ్ము చండీ, రాజు, కర్రి నాయుడు, శ్రీను, గోవిందు, చిట్టి, రంగారావు పాల్గొన్నారు.

సాఫీగా.. సర్వసభ్య సమావేశం



వైద్య సేవలపై వివరిస్తున్న డాక్టరు ప్రసాద్

కోటవురట్ల: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం కేకలు, వాగ్వాదాలు లేకుండా సాఫీగా జరిగిపోయింది. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో బుధవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎంపీపీ శింగంపల్లి అప్పలనాయుడు అధ్యక్షత వహించగా వైస్ ఎంపీపీ ఆర్ఎస్ సీతారామరాజు శాఖల వారీ సమీక్ష చేశారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీనివాసు మాట్లాడుతూ జల్ జీవన్‌మిషన్‌కు సంబంధించి మండలంలో 67 పనులు మంజూరు కాగా 15 పనులు పూర్తయినట్టు తెలిపారు. 15 వాటర్ ట్యాంకులు నిర్మిస్తుండగా ఇప్పటికి 12 పూర్తయినట్టు చెప్పారు. హౌసింగ్ జేఈ ప్రసాద్ మాట్లాడుతూ ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి కొత్తగా మంజూరు లేవని, పాత వాటిలో ఇంకా నిర్మాణాలు చేయనివారు ప్రారంభించాలని కోరారు. పీఆర్ జేఈ వర్మ మాట్లాడుతూ మండలంలో 83 సీసీ రోడ్లు, 4 జెడ్పీ పనులు మంజూరు కాగా వివిధ దశల్లో ఉన్నట్టు తెలిపారు. సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టరు ప్రసాద్ మాట్లాడుతూ సీహెచ్‌సీలో ప్రతిరోజూ 250 నుంచి 300 ఓపీ నమోదవుతుందన్నారు. ఇన్‌పేషెంట్లు 30 నుంచి 40 మంది ఉంటున్నారన్నారు. పారిశుధ్య సమస్య వేధిస్తోందని, పంచాయతీ కార్మికులు చెత్తను తీసుకెళ్లడం లేదని పరిష్కరించాలని కోరారు. తంగేడు పశువైద్యాధికారి ప్రతాప్ మాట్లాడుతూ మండలంలో 12,400 టీకాలు లక్ష్యంగా గాలికుంటు వ్యాధి నిరోధక టీకా కార్యక్రమం జరుగుతోందని తెలిపారు. హార్టీకల్చర్ అధికారి హరిప్రియ మాట్లాడుతూ ఉద్యానవన శాఖ ద్వారా రైతులకు అనేక ప్రోత్సాహకాలు అందిస్తున్నామన్నారు. ఉపాధి హామీ పథకం ఏపీవో నాగరాజు మాట్లాడుతూ గత ఏడాది రూ.21 కోట్లు వినియోగించి పనులు చేయగా ఈ ఏడాది ఇప్పటి వరకు రూ.14 కోట్లు ఖర్చు చేసినట్టు తెలిపారు. మండలంలో 150 ఎకరాలలో పండ్ల మొక్కల పెంపకం చేపట్టనున్నట్టు తెలిపారు. గత ఏడాది పశువుల షెడ్లు 27 మంజూరు కాగా రూ.10 లక్షల నిధులు అందించామని, ఇంకా రూ.50 లక్షలు విడుదల కావలసి ఉందన్నారు. ఈ ఏడాదికి 50 షెడ్లు మంజూరు చేస్తున్నట్టు తెలిపారు. సర్పంచ్ చీకట్ల జగదీష్ మాట్లాడుతూ తరచూ అధికారులు సమావేశాలకు డుమ్మా కొడుతున్నారని, ఇలా చేయడం వల్ల సమస్యలు ఎలా పరిష్కారం అవుతాయని ప్రశ్నించారు. మరో సర్పంచ్ శానాపతి గోపాలకృష్ణ మాట్లాడుతూ చౌడువాడకు ఆర్టీసీ బడి బస్సు లేకపోవడంతో సుమారు 120 మంది విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారన్నారు. ఎంపీటీసీ సభ్యులు పుట్రేవు సూర్యారావు, పెట్ల రాంబాబు మాట్లాడుతూ నర్సీపట్నం నుంచి అడ్డురోడ్డుకు రెండు ఆర్టీసీ బస్సులు మాత్రమే తిరుగుతున్నాయని, ప్రస్తుతం మహిళలకు ఉచిత బస్సు సదుపాయం ఉండడంతో బస్సులు సరిపోవడం లేదని తెలిపారు. ఈ సమావేశంలో ఎంపీడీవో చంద్రశేఖర్, తహసీల్దారు తిరుమలబాబు, అధికారులు పాల్గొన్నారు.

శరన్నవరాత్రులకు అంకురార్పణ



శరన్నవరాత్రులకు రాట వేస్తున్న భక్తులు

నక్కపల్లి: ఈ నెల 22 నుంచి ప్రారంభమయ్యే శరన్నవరాత్రులకు ఏర్పాట్లు ప్రారంభమయ్యాయి. వివిధ గ్రామాల్లో దసరా నవరాత్రులు జరిపేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ సందర్భంగా రాట వేసే కార్యక్రమం నిర్వహించారు. దేవవరంలో శరన్నవరాత్రులకు సంబంధించి పందిరి రాట వేసే కార్యక్రమం బుధవారం జరిగింది. ఉపమాక, నక్కపల్లి, ఉద్దండపురం, గొడిచర్ల, కాగిత, తదితర గ్రామాల్లో కూడా పందిరి రాట వేసే కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భవానీ భక్తులతో పాటు, సర్పంచ్ రాఘవకుమారి, మార్కెట్ కమిటీ చైర్మన్ దేవర సత్యనారాయణ, మాజీ ఎంపీటీసీలు గొర్ల నర్సింహమూర్తి, దండు బలరామరాజు, అంగరాజు రామరాజు, ఉప సర్పంచ్ వేగేశ్న చంటి, గణపతి, రమణ, నూకరాజు పలువురు మహిళలు, గ్రామపెద్దలు, కమిటీ నిర్వాహకులు పాల్గొన్నారు.

సామాజిక భవనం పరిశీలన



గవర్ల అనకాపల్లిలో సామాజిక భవనం పరిశీలిస్తున్న పంచాయతీ రాజ్ ఈఈ శారదాదేవి

మునగపాక: మండలంలోని తోటాడ శివారు గవర్ల అనకాపల్లిలో సామాజిక భవనాన్ని బుధవారం పంచాయతీ రాజ్ ఈఈ శారదాదేవి పరిశీలించారు. రూ.10 లక్షల వ్యయంతో జిల్లా పరిషత్ నిధుల ద్వారా నిర్మించిన భవనాన్ని ఆమె స్థానిక ఇంజినీరింగ్ అధికారి గులామ్‌తో కలిసి సందర్శించారు. సామాజిక భవనాన్ని అందుబాటులోకి తీసుకువచ్చేలా చూడాలన్నారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

యలమంచిలి రూరల్: అనకాపల్లి డివిజన్ విద్యుత్ శాఖ పరిధి యలమంచిలి సెక్షన్‌లో ఆర్‌డీఎస్‌ఎస్ పనుల కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని అనకాపల్లి విద్యుత్ శాఖ ఈఈ రాజశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. యలమంచిలి ఉపకేంద్రం పరిధి యలమంచిలి పట్టణం, కొత్త ఎర్రవరం సోమలింగపాలెం, కట్టుపాలెం,రామారాయుడుపాలెం,కొత్తపాలెం వ్యవసాయ కనెక్షన్లు,పెదపల్లి ఉపకేంద్రం పరిధి కొక్కిరాపల్లి,చిన షేకిళ్లపాలెం,పెద షేకిళ్లపాలెం గ్రామాల్లో ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ ఉండదని పేర్కొన్నారు. రైతులు, ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని ఆయన కోరారు.

ఎస్.రాయవరం: కొరుప్రోలు, పెదగుమ్ములూరు, ఎస్.రాయవరం విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని అనకాపల్లి ఈఈ రాజశేఖర్ తెలిపారు. పెదగుమ్ములూరు సబ్‌స్టేషన్ పరిధిలో పెదగుమ్ములూరు, భీమవరం, గోకులపాడు, ఎస్.రాయవరం సబ్‌స్టేషన్ పరిధిలో ఉప్పరాపల్లి, వెంకటాపురం, లింగరాజుపాలెం, జేవీపాలెం, సర్వసిద్ధి, కర్రివానిపాలెం, బసవపాడు, సైతారుపేట, వాకపాడు, కొరుప్రోలు సబ్‌స్టేషన్ పరిధిలో కోనవానిపాలెం, టీఏ రోడ్డు, తిమ్మాపురం తదితర గ్రామాల్లో ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు.

యూరియా కోసం యుద్ధం?



కోటవురట్ల పీఏసీఎస్ వద్ద యూరియా కోసం ఎగబడుతున్న రైతులు

కోటవురట్ల: సాగు చేయాలంటే యూరియా కోసం యుద్ధాలు చేయాల్సిందేనని ఈ రైతులను చూస్తే ఇట్టే అర్థమవుతుంది. యూరియా ఎక్కడ దొరక్కుండా పోతుందోనని అన్నదాతలు ఇలా ఎగబడుతున్నారు. మండలంలో పీఏసీఎస్ ద్వారా బుధవారం ఎరువుల పంపిణీ ప్రారంభించారు. దీంతో రైతులు యూరియా కోసం ఇలా తొందరపడుతూ ఎగబడ్డారు.